క్లుప్తంగా

నేడు ధార్మిక క్విజ్

కడప కల్చరల్: కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు నగరానికి చెందిన విద్యార్థులకు ధార్మిక క్విజ్ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి తెలిపారు. ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు ధార్మిక కార్యక్రమాలను వినూత్న రీతిలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ధార్మిక క్విజ్, మధ్యాహ్నం 2 గంటలకు అదే తరగతులకు ధారణ (మెమొరీ) పోటీ ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు బుధవారం కూడా ఆలయ నిర్వాహకులను నేరుగా కలిసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఉపాధ్యాయుడు లేదా సహాయకుడితో కలిసి రావాలని, పాఠశాల యాజమాన్యం అనుమతి పత్రం అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

20న మోడల్ పరీక్ష

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే పదో తరగతి మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఆర్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాల నమోదు తప్పనిసరి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రైవేటు యాజమాన్యాల్లో ఉన్న ఎల్‌జేకే, యూకేజీ విద్యార్థుల నమోదును స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ బ్రహ్మానందరెడ్డి, ఏపీవో జ్వాలాపతి, బెటాలియన్ హెచ్‌ఎం భాస్కర్ సూచించారు. ఆర్‌జేడీ, డీఈఓల ఆదేశాల మేరకు మంగళవారం కడప మండల పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలలను సీఆర్పీల ఆధ్వర్యంలో సందర్శించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు శంకర్, కృష్ణ, చైతన్య ప్రిన్సిపాల్ షర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

12న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఈనెల 12న నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశ కరపత్రాలను యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్, జిల్లా కో కన్వీనర్ అయ్యవారురెడ్డి, కరీముల్లా, నాయకులు సివి రమణ, బాబు, చెన్నయ్య, సుబ్బారెడ్డి, ఆస్లాంబాష, సూర్యకుమార్ పాల్గొన్నారు.

భాషా దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలి



మొల్ల విగ్రహానికి వినతిపత్రమిస్తున్న గానుగపెంట హనుమంతరావు

కడప కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని తెలుగు భాషా వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక కోటిరెడ్డిసర్కిల్ కూడలిలోని మొల్ల విగ్రహానికి ఆయన భాషా పరిరక్షణ కోసం వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ప్రభుత్వం మాతృభాషా పట్ల తనకు గల గౌరవ అభిమానాలను చాటుకోవాలని ఆయన కోరారు. మాతృభాషను కాపాడుకోవాలని ప్రతి తెలుగువాడి ధర్మమని తెలిపారు.

వాహనాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అప్సరా సర్కిల్‌లో మంగళవారం సాయంత్రం ఎస్ఐ జి. అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు. వాహనదారులు తమ దగ్గర రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు.

నవరత్నాలతో నవశకం

– ఉప ముఖ్యమంత్రి
ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో నవశకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మంగళవారం 47వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా...మీకు ఎంత లబ్ధి జరిగింది అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోతే అందించాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. భూపతి లక్ష్మీదేవి అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.99 లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. షేక్ మాబున్నీ అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.64లక్షల లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. చెన్నూరు లక్ష్మీదేవి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.8.97లక్షల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేస్తూ ప్రజలకు మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే కలకాలం ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లక్ష రూపాయల నుంచి రూ.12లక్షల వరకూ మేలు జరిగిందని, ప్రజలంతా ప్రభుత్వ పాలన పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు, 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్, షఫీ, శ్రీరంజన్‌రెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, ఉమైర్, బాలస్వామిరెడ్డి, టీపీ వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

సకాలంలో జీతాలు చెల్లించాలి

ఎస్టీఎఫ్ పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు : సకాలంలో జీతాలు చెల్లించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక అనబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్టీఎఫ్ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీఎఫ్ ప్రొద్దుటూరు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీఎఫ్ పట్టణ నూతన అధ్యక్షుడుగా వినోద్, గౌరవాధ్యక్షుడుగా హరిరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ చౌడయ్య, వై.రాధాలక్ష్మితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

మైదుకూరు : మండలంలోని నంద్యాలంపేటలో మంగళవారం ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రాంతీయ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్సీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సి.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని మైదుకూరు మండలం నంద్యాలంపేట, మైలవరం మండలం వేపరాల, సింహాద్రిపురం మండలం సింహాద్రిపురం పంచాయతీలను ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రాంతీయ శిక్షణ కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మూడు పంచాయతీల నుంచి 60 మంది క్షేత్రస్థాయి సిబ్బందికి వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, రోడ్లపై ఉన్న చెత్త, రైతుల వద్ద నుంచి పేడను సేకరించడంపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రంలో న్యాడప్ తొట్లను, వర్మీ కంపోస్టు తయారీని సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నయ్య, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది

రేషన్ బియ్యం స్వాధీనం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని బైపాస్‌రోడ్డు సమీపంలోని ఓ ఇంటిలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 245 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. డీటీకి వచ్చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఆయన స్థానిక బైపాస్‌రోడ్డుకు సమీపంలోని కింగ్‌ప్లాజా హోటల్ వెనుక భాగంలోని ఓ ఇంటిని తనిఖీ చేయగా అందులో నిల్వ ఉంచిన 11,025 కిలోల 245 బస్తాల రేషన్ బియ్యాన్ని, ఆల్విన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వెంకటేశ్వర్లుతో పాటు ఆల్విన్ యజమాని సత్తార్‌పై అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫ్లెక్సీ ప్రింటర్ల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్: ఫ్లెక్సీ ప్రింటర్ల సమస్యలపై సంఘటితంగా పోరాటం చేస్తామని కడప జిల్లా ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రవికుమార్, కోశాధికారి డి. సురేష్ రెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు చెన్నకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించిన ప్రభుత్వం, ఫ్లెక్సీలపై కూడా నిషేధం విధిస్తూ జీవోలు జారీ చేసిందన్నారు. వీటిపై హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్రంలో పదిలక్షల కుటుంబాలు రోడ్డున పడే అవకాశముందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక .. ఏపీ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గండికోట హరిత రెస్టారెంట్‌లో సమావేశమై రాష్ట్ర అధ్యక్షులు రావూరి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి మహదేవ్, కోశాధికారి సీహెచ్ నాగేశ్వరరావు సమక్షంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె. మదన్‌మోహన్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శిగా ఎం. రవికుమార్, కోశాధికారిగా డి. సురేష్ రెడ్డి , గౌరవాధ్యక్షులుగా రాజు , గౌరవ సలహాదారుగా రూ. ఎం. శ్రీను, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ రఫీలను ఎన్నుకున్నామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం ఉక్కాయపల్లె హౌసింగ్ లే అవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని, నీటి బోర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలన్నారు. అంతకుముందు మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 1వ డివిజన్ పాతకడప, దేవునికడప ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దేవునికడప గుడి వెనుక డ్రైన్ నందు నీరు సజావుగా వెళ్లేందుకు కల్వర్టు నిర్మించాలని సూచించారు. మురికి కాలువలకు అడ్డుగా ఉన్న మొక్కలను తొలగించాలని ఆదేశించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్పొరేటర్ చెన్నయ్య, ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్ధన్, డీఈ వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతకడపలో ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

నగరాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

– ముఖ్యమంత్రితో మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్‌బాబు కలిశారు. ఇటీవల అస్వస్థత నుంచి కోలుకున్న ఆయన మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రామనపల్లె పైపులైన్‌కు రూ.16కోట్లు, బుగ్గవంకపై నిర్మించనున్న రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.20కోట్లు విడుదల చేయాలని కోరారు. తన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మేయర్ తెలిపారు.



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్

న్యాయ అంశాలపై అవగాహన అవసరం

– జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కవిత

వైవీయూ : విద్యార్థినులు న్యాయపరమైన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, మరియాపురం జూనియర్ కళాశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల్యవివాహాలు నేరమని వివరించారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, వివాహవయస్సుపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కవిత

ఘనంగా అప్జల్‌ఖాన్ జన్మదిన వేడుకలు

– పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్ జన్మదిన వేడుకలు మంగళవారం కడపలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అప్సర కూడలి, వైవీ స్ట్రీట్, సంధ్యా సర్కిల్, రవీంద్రనగర్ కూడళ్లలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అప్జల్‌ఖాన్‌తోపాటు ఆయన తనయులు రషీద్ ఖాన్, ఫవాజ్‌ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరై భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో అప్జల్‌ఖాన్ యువత అబిద్, సాజిద్, ఆసిఫ్, అబ్దుల్, ఖాజా, ఫైజన్, వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, అమానుల్లా, నాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు.



వైవీ స్ట్రీట్‌లో అన్నదానం చేస్తున్న అప్జల్‌ఖాన్

ఉద్యోగుల జీతాలను సకాలంలో చెల్లించాలి

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన నెలవారి వేతాలను సకాలంలో చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వివిధ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. కేవలం జీతాల మీద ఆధారపడి, ఎదురు చూస్తున్న ఉద్యోగుల జీతాలు చెల్లింపుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం అత్యంత బాధాకరం అన్నారు.యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, రూట రాష్ట్ర నాయకులు హిదయతుల్లా, ఐటా రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, ఇలియాస్‌బాషా, రూట జిల్లా అధ్యక్షుడు ఇర్షాద్ అహ్మద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

గడప గడపలో అపూర్వ ఆదరణ



గోటూరులో ప్రజలకు పథకాలగురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : మండలంలోని తొల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. తెరిసానగర్, గోటూరు, వెంకటేశాపురం గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డిలు పాల్గొన్నారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్ద ప్రజలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. పలు ప్రభుత్వ పథకాల ద్వారా మాకు లబ్ధి అందుతోందని, మేమంతా జగన్ వెంటే వుంటామని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వైఎస్ఆర్ సీపీ నేతలు శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామాంజులురెడ్డి, నిత్యానందరెడ్డి, కృష్ణమూర్తి, జంగిడి సుబ్బరాయుడు, గోసుల శివారెడ్డి, రాజేంద్రారెడ్డి, చంద్రారెడ్డి, అయవారు రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఎంఈఓ లిల్లెమ్మ, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఏఓ సాయిజ్యోతి, ఏపీఎం శైలజ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ గోల్డ్ లోన్ వారోత్సవం

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ వారి గోల్డ్ ప్రచార వారోత్సవాలను ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ కె.కళ్యాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెనరా బ్యాంకులో ఒక వ్యక్తికి గరిష్టంగా కోటి ఐదు లక్షల వరకూ గోల్డ్ లోన్ మంజూరు చేస్తామన్నారు. ఒక గ్రాముకు అత్యధికంగా రూ.4200 వరకూ రుణం సులువుగా, వేగంగా తక్కువ వడ్డీ రేటుతో మంజూరు చేస్తున్నామని వివరించారు. కస్టమర్ల సులభతరంగా ఉండేందుకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొనుటకు వీలు కల్పించామన్నారు. కెనరా బ్యాంకు ఆర్ఎం కేఎం మోహన్, డివిజనల్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ, ఆర్థిక సాయం

కడప కార్పొరేషన్: విద్యుత్ ప్రమాదానికి గురైన వ్యక్తికి ఆకాంక్ష సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వితరణగా అందజేసి ఆర్థిక సాయం చేశారు. జిల్లాలోని భాకరాపేట సమీపంలోని మలినేనిపట్నం గ్రామంలో సిద్దయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై వెన్నుపూస దెబ్బతిని పూర్తిగా మంచానికే పరిమితం అయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఆకాంక్ష సేవా సమితి అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి వారి సోదరులు యెర్ల సుందరరామిరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ఐదువేల రూపాయల నిత్యావసర సరుకులు, రూ.2వేల నగదు అందజేశారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైవీయూలో వెన్నపూస ముమ్మర ప్రచారం

కడప కార్పొరేషన్: జిల్లాలోని యోగి వేమన యూనివర్సిటీలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయన వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రతి డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి ప్రొఫెసర్లను, గ్రాడ్యుయేట్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎన్. వెంకట్రామిరెడ్డి, తేజ, పీరా, డి. సురేంద్ర, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో సినీ, టీవీ నటుల ప్రార్థనలు



అమీన్‌పీర్ దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న నటులు

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో మంగళవారం సినీ, టీవీ నటులు ప్రార్థనలు నిర్వహించారు. సినీ నటుడు మధునందన్, టీవీ నటుడు వాసు వన్స్‌మోర్ దర్గాకు చేరుకోగానే దర్గా ముజావర్ అమీర్ ఆయనకు సాంప్రదాయ బద్ధంగా పేటా చుట్టి దర్గా గురువుల దర్శనం చేయించారు. తొలుత వారు దర్గాలోని హజరత్ పీరుల్లామాలిక్ మజార్‌తోపాటు ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు. దర్గా గురువుల విశిష్టత, చరిత్రనుఅమీర్ వారికి వివరించారు.

అప్పర్ భద్ర నిర్మాణంతో రాయలసీమ ఎడారే

కడప వైఎస్సార్ సర్కిల్: అప్పర్ భద్ర నిర్మాణంతో రాయలసీమ ప్రాంతం ఏడారిగా మారుతుందని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కర్ణాటకలోని అప్పర్ భద్రకు జాతీయ హోదా కల్పిస్తూ కేంద్ర బడ్జెట్‌లో రూ.5300 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. అప్పర్ భద్ర నిర్మాణం జరిగితే కడప, అనంతపురం,కర్నూలు, ఉమ్మడి జిల్లాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు.ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, ప్రతాప్‌రెడ్డి, మునిరెడ్డి పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

కడప వైఎస్సార్ సర్కిల్: విద్యార్థులు పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని 5వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 45వ డివిజన్ చెమ్మిమియ్యాపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మెటీరియల్ పంపిణీ చేసిన విద్యార్థులతో కార్పొరేటర్ నిరంజన్‌రెడ్డి, హెచ్‌ఎం

కడప ఎడ్యుకేషన్: కడప నగరపాలక పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులందరూ ఈ ఏడాది పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించాలని 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ, 21వ డివిజన్ కార్పొరేటర్ నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరపాలక పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు నగర మేయర్ సురేష్ బాబు, కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆధ్వర్యంలో ప్రేరణ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కడప నగరపాలక మొయిన్ ఉన్నత పాఠశాల, గాంధీనగర్ ఉన్నత పాఠశాలల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, నిరంజన్‌రెడ్డి విద్యార్థులకు మెరిటియల్‌ను అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగమణి, సత్యసుజాతమ్మ, పీఆర్‌సీలు కృష్ణ, ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రవళిక, మహిళా సంరక్షకురాలు శాంతి పాల్గొన్నారు.